# నేను సైతం ఇంటి పొయ్యికి...

మనమాటలు - పేటలూ, తోటలూ, కోటలు దాటిపోతాయి గానీ, మన చేతలు మననుంచి అరంగుళం మేర దాటిపోవు. మనం మాటల మనుషులం. కోతల రాయుళ్ళం, బడాయి సన్యాసులం, అరచేతితో స్వర్గం, కైలాసం, వైకుంఠం ఇంకా ఇంకా ఇలాంటివి చూపెడుతూ ఉంటాం. మన అభ్యుదయం, కాగితాలమీద అద్భుతంగా చిత్రికమయి ఉంటుంది. మన పథకాలు - పరమ రమణీయంగా ఉంటాయి. మన ప్రణాళికలు చదివిన వారికి నోరూరి లొట్టలు వేయలేక ఛస్తారు. కానీ, మన బతుకుల్లో ఆ ఛాయలేవీ కనిపించవు. నాలుగు దశాబ్దాల కింద సామాన్య జన జీవనం ఎలా ఉన్నదో- ఈనాడు అలాలేదు. మరింత దిగజారి దిగజారి దిగజారి పరమ అధ్వాన్నంగా తయారయింది. పేదలు నిరుపేదలయ్యారు. ఉన్నవారు మరింత ఉన్నవాళ్ళయ్యారు. నాలుగెకరాల రైతు, కూలీవాడుగా మారితే - నలభయ్ఎకరాల ఆసామి వ్యవసాయం మానేసి, కాంట్రాక్టరుగా మారి లక్షలు సంపాదించాడు.

మనబతుకులిలా బుగ్గి పాలు కావడానికి, దేవుడే కారణమనుకుంటున్నది గానీ, మనల్ని పరిపాలించే వారే కారణమని ఆమెకు తెలీదు. మనం తెలియజెప్పినా ఆమె వినదు. ఒక వేళ విన్నా నమ్మదు. నిజం చెప్పినా నమ్మనంత మూఢత్వంలో మన పాలకులు, మన పాలనా వ్యవస్థ పోశమ్మను అట్టే పెట్టిన విషయం మనలో చాలా మందికి తెలియదు.

నెహ్రూ 'సోషలిస్టు తరహా సమాజం' నెలకొల్పుతానన్నారు. ఇందిరాగాంధీ 'సోషలిజమే మనపరమ లక్ష్యం' అన్నారు. ఈ ఉభయ ప్రభుత్వాలూ, దేశాన్ని మూడు దశాబ్దాల పాటు దున్నిపారేశాయి. సోషలిజం సంగతి సరేసరి- సామాన్యుడికి నిలువనీడ లేకుండా పోయింది.

మనం మోసగాళ్ళం, దగాకోరులం, మహా వంచకులం, గుర్రం ముట్టెకు పచ్చగడ్డి పరకల్ని లగాయించి, బక్క గుర్రం చేత చావు పరుగు తీయించిన ఆది మానవులం. శుష్కవాగ్దానాలతో ప్రజల్ని మోసగించి, వంచించి, అదిరించి, బెదిరించి, గెలిచి సింహాసనాలమీద కూచున్న జాతి మనది. అలా గెలిచిన వాళ్ళ కాళ్ళు పట్టుకొని, వారి ఎంగిలి నీళ్ళు గతికి, దానితోనే సంతృప్తిపడి, తోకలు ఆడించే బజారు కుక్కలం.

కాకపోతే- పోశమ్మ బతుకిలా బుగ్గిపాలెందుకయింది! ఆ వయస్సులో సుఖంగా కాలక్షేపం చేయవలసిన పోశమ్మ జీవితం నిప్పుల కుప్పలా ఎందుకు తయారయింది?

పోశమ్మను మీరెప్పుడన్నా కలుసుకుని, ఆప్యాయంగా పలకరించిచూడండి, మీ గుండెలు బద్దలయ్యే గాథ వినిపిస్తుంది. ఒక మనిషి- మరో మనిషిపట్ల ఇంత క్రూరంగా ప్రవర్తించగలడని మీరు ఊహించను కూడా లేరు.

"నా బతుకు బండలయిందిరా బిడ్డా! వాళ్ళ కొంపలు నాశనమయిపోను. వాళ్ల బొందలమీద జిల్లేళ్ళు తంగేళ్ళు మొలవ. నా ఉసురు వాళ్ళకెప్పుడు తగులుద్దో బిడ్డా!" అని భోరుమంటుంది పోశమ్మ.

గద్వాల సంస్థానం, కవి పండితులను ఆదరించిందనీ, సారస్వతానికి సేవ చేసిందనీ చెబుతారు.

వారికి పట్టుశాలువలూ, భారీ సంభావనలూ యిచ్చిందనీ చెబుతారు. వందల మందికి వార్షికాలు ఇచ్చేవారని ఇప్పటికీ చెప్పుకుంటూ వుంటారు. కానీ వీరందరినీ సన్మానించేందుక్కావలసిన సంపదను పోశమ్మలాంటి సామాన్యులే సృష్టించారని చాలా మందికి తెలియదు, పోశమ్మకూ తెలియదు.

గద్వాల సంస్థానంలోని చిన్న పల్లెటూరులో పదెకరాల పొలానికి కాపలాదారు రాంరెడ్డి. ఎన్నో ఏళ్ళుగా, రాంరెడ్డి ఆ పొలాన్ని సేద్యం చేస్తున్నాడు. అయినా ఆ భూమ్మీద అతనికి హక్కులేదు. అతను కేవలం కౌలుదారు మాత్రమే. ప్రభువుల అవసరాన్ని బట్టి శిస్తులు పెరుగుతూ ఉంటాయిట. పెరగడమే తప్ప తరగడం లేదుట. పెరిగిన శిస్తును ఇవ్వలేక పోతే పొలం వదులుకోవలసిందేనట. "ఒదులుకొని ఏం చేస్తాం బిడ్డా! ఎగసాయం తప్ప ఇంకోటి చేతకాదాయె. యగసాయానికయినా" ఏం గుర్తుకొచ్చిందోగానీ ఏడ్చేసింది పోశమ్మ.

అన్నదమ్ముల తగాదా, 'దొర' అఘాయిత్యం, వానలు లేకపోవడం, పెట్టుబడి కొరత- ఈ కారణాలన్నింటి వల్ల - పొలాన్ని విడిచిపెట్టి, రాంరెడ్డి కూలి చేసుకు బతికాడు. పోశమ్మను, బిడ్డల్ని బతికించాడు!

"ఓసారి పొలం పోయాడు. నా దేవుడు మళ్ళీ రాలా! పొలంలో పురుగుముట్టింది. అక్కడే చచ్చిపోయాడు... పిల్లలు పెద్దవాళ్ళే బిడ్డా! చదువులేదు, అయినింటివాళ్ళ పిల్లల్ని తెచ్చి పెళ్ళిళ్లు చేశా. వాళ్ళు పెళ్ళాల మాటలు విని నన్ను వదిలేసి పోయారు. ముగ్గురు మగబిడ్డలున్నా నాకీ చాకిరీ తప్పలేదు నాయనా!" అన్నది పోశమ్మ.

ఆమె హైదరాబాద్ వచ్చి కూడా ఇరవయ్యేళ్లు దాటింది.

"చాలా పనిచేశా. కూలిపని చేశా. ఇటికపని చేశా. సున్నం కొట్టె వాళ్లతో పని చేశా. ఇళ్ల దగ్గర కసువుపనీ అంట్లు తోమే పని చేశా. చేసి చేసి నా రెక్కలు విరిగిపోయాయి. తిరిగీ తిరిగీ నా కాళ్లు అరిగిపోయాయి.... మాయబతుకు నాయనా! ఈ పాడుముండాకొడుకు - దేవుడు సచ్చినోడు ఆకలి ఎందుకు పెట్టాడో తెలియదు. సముద్రాలు నిండుతున్నాయిగానీ, నా జానెడు పొట్టానిండడం లేదు బిడ్డా!" అన్నది పోశమ్మ తడి అయిన కళ్లను తుడుచుకొంటూ.

ఓపిక తగ్గింది. ముసలితనం శరీరాన్ని కమ్ముకొన్నది. మరింత తిరగలేననుకొంది. మెల్లగా ఈ 'బేరం'లోకి దిగింది.

మొదట్లో తనే పేడ పోగేసుకొచ్చేది. వరి ఊక, దంటుముక్కలు, కాగితం పీచులు వేసి, తొక్కి పిడకలు చేసి అమ్ముకొనేది. బాయిలర్లు రావడంతో పిడకలకు గిరాకి తగ్గిపోయింది. అందుకని ఈ ఉండలు చేసి అమ్ముతున్నదిప్పుడు.

"నడవలేను. కాళ్ళ తీపులు, లేస్తే తూలుదొస్తున్నది. నర్సింలు దగ్గర బర్రెలున్నయ్. పేడకొంటా... నులి బొగ్గునుసి కొంటా. కలిపి ఉండలు చేస్తా. ఇప్పుడా పని చెయ్యలేను బిడ్డ. రెండో మూడో ఇచ్చి లచ్చువమ్మను బతిమిలాడతా, ఏ సందకాడో వచ్చి పని చేసి పోద్ది. ఆరబడెతా, అమ్ముకుంట."

పోశమ్మ సమస్యలు ఈ బేరానికి సంబంధించి చాలా వున్నాయి. ఉండలు చేశాక ఆరబెట్టడం అన్నింటిలోకి పెద్ద సమస్య. మహాపట్నం కదా. స్థలం ఉండదు. రోడ్డువారన ఆరబెట్టుకొంటే మునిసిపాలిటీ వాళ్ళు గొడవ పెడతారు. పోలీసులు పేచీపెడతారు. అయినా ఏదో విధంగా బండిని

నెట్టుకొస్తూనే వుంది పోశమ్మ.

"ముసలీ ముతకావాళ్ళకు సర్కారోలళ్ళుసాయం చేస్తున్నామన్నారంట. ఎవరో అన్నారు. అక్కడికెళ్ళా. నన్ను చేర్చుకోమని అడిగా, బతిమిలాడా ఏందేందో కాగితాలు కావాలన్నారు కొడుకులు. అయ్యేందో నాకు తెలవదు విసుగేసింది. మానేశా..."

సికిందరాబాదులో ఉన్న మరో సంస్థవారిని కూడా పోశమ్మ అడిగి చూసింది. అప్పటికి వారిదగ్గర పెండింగులో వున్న దరఖాస్తులు చాలా ఉన్నాయని, ఆ లిస్టు పూర్తయితే తప్ప కొత్తవారిని చేర్చుకోలేమని, అలా చేర్చుకోవడానికి తమ సంస్థ నిబంధనలు ఒప్పుకోవనీ వారన్నారు. ఇక చేసేదేమీ లేక, ఈ వృత్తినే అంటి పెట్టుకొని వుంది పోశమ్మ.

"ఒకప్పుడు బాగా బతికినదాన్ని బిడ్డా! ఒకళ్ళకింత పెట్టాగానీ, అడుక్కోలేదు. ఇప్పుడా- ఈ చీర నాది కాదు. ఈ అంగీ నాది కాదు. నేనుంటున్న గుడిశ నాది కాదు"అన్నది పోశమ్మ.

ఈ పుణ్యభూమిలో పోశమ్మకు 'నాది' అని చెప్పుకోదగ్గవేమీ లేవు- ఒక్క ఆకలి, దరిద్రమూ తప్ప.